సాక్షి నిజామాబాద్

మంగళవారం । 7 । నవంబర్ । 2023



బీడీ కార్మికులే కీలకం..

అసెంబ్లీ ఎన్నికల్లో బీడీ కార్మికుల ఓట్లే కీలకం కానున్నాయి. దీంతో పార్టీలు వారిని ఆకట్టుకునేందుకు ప్రణాళికలు వేస్తున్నాయి.

- IIలో ▸



ఎన్నికల్లో మైసూర్ సిరా

ఎన్నికలో భాగంగా చేతివేలికి సిరా గుర్తు పెట్టడం ఆనవాయితీ. ఈ సిరా కర్ణాటక రాష్ట్రం నుంచి దేశవ్యాప్తంగా సరఫరా అవుతుంది.

- IIలో ▸

గరిష్టం/కనిష్టం
32.2 /21.5

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లటిగాలులు వీస్తాయి. సాయంత్రం నుంచి చలితీవ్రత పెరుగుతుంది. రాత్రి పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

రూ.25.73 లక్షల నగదు స్వాధీనం



ఖలీల్‌వాడి : పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగనావర్ ఆదేశాల మేరకు అక్రమంగా తరలిస్తున్న రూ. 25 లక్షల73 వేల నగదును స్వాధీనపరుచుకున్నట్లు ఏసీపీ కిరణ్ కుమార్ తెలిపారు. సోమవారం ఆయన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఎల్లమ్మ గుట్ట ఏరియాలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న నగదును మోర దీపక్ అనే వ్యక్తి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నామన్నారు. నగదును ఐటీ అధికారులకు అప్పగించనున్నట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచిన పట్టణ సీఐ నరహరి, నాలుగవ పట్టణ ఎస్సై సంజీవ్, సిబ్బంది రామకృష్ణ, రమేష్‌లను ఏసీపీ కిరణ్ కుమార్ అభినందించారు.

రూ.65 లక్షల అల్ప్రాజోలం పట్టివేత



కామారెడ్డి క్రైం : కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ఆవరణలో సోమవారం ఉదయం ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆరున్నర కిలోల అల్ప్రాజోలం పట్టుకుని ఇద్దరిని రిమాండ్ చేసినట్లు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథం తెలిపారు. కామారెడ్డి ఎక్సైజ్ సీఐ కార్యాలయంలో సోమవారం ఆయన వివరాలు వెల్లడించారు. సిద్దిపేట పట్టణంలోని రాఘవేంద్ర కాలనీకి చెందిన అంబరి రమేష్ గౌడ్ 6.30 కిలోల అల్ప్రాజోలం తీసుకొని సోమవారం కామారెడ్డి కొత్త బస్టాండ్‌లో నిర్మల్ ఏరియాకు చెందిన వ్యక్తి కోసం ఎదురుచూస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు చేసి పట్టుకున్నట్లు తెలిపారు. గతంలో అంబరి రమేష్‌గౌడ్ ఓ ల్యాబ్‌లో సూపర్‌వైజర్‌గా పని చేసేవాడని తెలిపారు. నిర్మల్‌కు చెందిన లింగేశ్‌ను రప్పించి, ఆ ఏరియాకు తరలించేందుకు సిద్ధమవుతుండగా అధికారులు పట్టుకున్నారు. దీని విలువ సుమారు రూ.65 లక్షల వరకు ఉంటుందన్నారు. వీటితో పాటు రెండు బైకులను సీజ్ చేశామని తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో గతంలో కేసులు ఉన్న వారిని సైతం బైండోవర్ చేస్తున్నామన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కిషన్, కామారెడ్డి ఎక్సైజ్ సీఐ విజయకుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ బైక్ ర్యాలీ, సభను జయప్రదం చేయండి



ఖలీల్‌వాడి: నగరంలో నేడు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే బైక్ ర్యాలీ, బహిరంగసభను విజయవంతం చేయాలని నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కేశ వేణు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్‌హందాన్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో సోమవారం అర్బన్ కాంగ్రెస్ అభ్యర్థి షబ్బీర్‌అలీ తరపున నగర కాంగ్రెస్ నాయకులు నామినేషన్ దాఖలు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. షబ్బీర్ అలీ నేడు మొదటిసారి జిల్లా కేంద్రానికి వస్తున్న సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం పలుకనున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో షబ్బీర్ అలీని ఘన మెజారిటీతో గెలిపించాలని కోరారు. నాయకులు రత్నాకర్, నయీం అలీ, నజీబ్ అలీ, శివప్రసాద్, గోపి, విక్కీ, వేణురాజ్, విపుల్‌గౌడ్, జావేద్ అక్రమ్ పాల్గొన్నారు.



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి ప్రశాంత్ రెడ్డి



బోధన్‌లో నామినేషన్ వేస్తున్న బీజేపీ అభ్యర్థి వడ్డి మోహన్ రెడ్డి



నామినేషన్ సమర్పిస్తున్న జుక్కల్ బీజేపీ అభ్యర్థి అరుణతార, పక్కన డీకే అరుణ

అట్టహాసంగా నామినేషన్లు..

భీమ్‌గల్/బోధన్ : బాల్కొండ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి వేముల ప్రశాంత్ రెడ్డి సోమవారం భీమ్‌గల్‌లో నామినేషన్ దాఖలు చేశారు. రిటర్నింగ్ అధికారి చిత్రామిశ్రాకు నామినేషన్ పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రూ. 150 కోట్లతో భీమ్‌గల్‌ను అభివృద్ధి చేశానన్నారు. నామినేషన్ అనంతరం మంత్రి వేముల సతీసమేతంగా లింబాద్రి గుట్ట ఆలయంలో పూజలు చేశారు. బోధన్ అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి వడ్డి మోహన్‌రెడ్డి సోమవారం రెండు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. బోధన్ ఆర్డీవో ఆఫీస్‌లో ఆర్వో రాజాగౌడ్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు. జుక్కల్ బీజేపీ అభ్యర్థి అరుణతార మద్నూర్‌లో నామినేషన్ దాఖలు చేశారు. బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పాల్గొన్నారు.

కుదరని సయోధ్య..

పుట్టి మునిగేనా..

- బాల్కొండ కాంగ్రెస్‌లో నేతల మధ్య సయోధ్య కుదర్చని నాయకత్వం
- మోర్తాడ్‌లో రాహుల్ సభకు సైతం హాజరు కాని మానాల, ఈరవత్రి.
- బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్న మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు నీరడి భాగ్య
- నిజామాబాద్ రూరల్, అర్బన్‌లలో సమన్వయం చేయడంలో సక్సెస్

అధికారం చేజిక్కించుకునేందుకు శాసనసభ ఎన్నికల్లో సర్వశక్తులూ ఒడ్డుతున్న కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ల కేటాయింపులో అనేక మలుపులు చోటుచేసుకున్నాయి. టికెట్లు ఆశించి భంగపడ్డ నేతలు పార్టీ అభ్యర్థులకు సహకరించడం లేదు. అసంతృప్తుల బుజ్జగింపు, నాయకుల మధ్య సమన్వయం విషయంలో పార్టీ నాయకత్వం సీరియస్‌గా దృష్టి సారించకపోతుండడంతో అసంతృప్తుల్లో అసహనం పెరుగుతోంది.



ఈరవత్రి అనిల్



మానాల మోహన్‌రెడ్డి



మంత్రి ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన నీరడి భాగ్య

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాలకు సంబంధించి టికెట్లు ఆశించి భంగపడిన నాయకుల మధ్య కీలక నేతలు సయోధ్య కుదిర్చి ఐక్యతారాగం చాటేలా చేశారు. బాల్కొండ విషయంలో మాత్రం పార్టీ అభ్యర్థి, కీలక నాయకుల మధ్య సయోధ్య కుదర్చడంలో తమకు సంబంధం లేనట్లుగా వ్యవహరిస్తుండడంపై పార్టీ శ్రేణుల్లో గందరగోళం నెలకొంది.

బాల్కొండ కాంగ్రెస్‌లో..

బీఆర్‌ఎస్ నుంచి బలమైన అభ్యర్థిగా బరిలో ఉన్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఇప్పటికే ప్రచారంలో దూసుకుపోతున్నారు. బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్యే ఏలేటి అన్నపూర్ణమ్మ సైతం ప్రచారపర్వంలో దూకుడుగా ముందుకెళుతున్నారు. ఈ క్రమంలో ఇటీవలే పార్టీలో చేరి టికెట్టు దక్కించుకున్న ముత్యాల సునీల్‌రెడ్డి ఇదే నియోజకవర్గానికి చెందిన టికెట్టు ఆశించి భంగపడిన డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, విప్ ఈరవత్రి అనిల్‌తో ఇప్పటివరకు సమావేశం కాలేదు. దీంతో వీళ్లు గుర్రుగా ఉన్నారు. బాల్కొండ అభ్యర్థిగా సునీల్‌రెడ్డి ఖరారై 20 రోజులు గడిచినప్పటికీ ఈ నేతలతో ఉమ్మడిగా వేదిక పంచుకోలేదు. ఈ క్రమంలో మోర్తాడ్‌లో అగ్రనేత రాహుల్‌గాంధీ సమావేశంలో సైతం మానాల, ఈరవత్రి, కనిపించలేదు. పైగా వీళ్లు రాహుల్ ఆర్మూర్ సభలో మాత్రం పాల్గొన్నారు. ఆర్మూర్ సభలో రాహుల్‌గాంధీ మానాల మోహన్ రెడ్డితో నేనున్నానంటూ అనునయించడం గమనార్హం. కాగా బాల్కొండ నియోజకవర్గంలో సయోధ్య వాతావరణం నెలకొల్పే విషయంలో రాష్ట్ర నాయకత్వం సైతం చొరవ తీసుకోకపోవడం పట్ల మానాల, ఈరవత్రి అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా ఇదే నియోజకవర్గంలోని వేల్పూర్ మండలానికి చెందిన మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ సర్పంచ్, మాజీ ఎంపీపీ, మాజీ జెడ్పీటీసీ అయిన నీరడి భాగ్య మంత్రి ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. నియోజకవర్గంలో పార్టీ పరంగా తనకేమాత్రం గౌరవం, ప్రాధాన్యత దక్కలేదని భావించిన భాగ్య ఈ నిర్ణయం తీసుకోవడం విశేషం. మరోవైపు మండల పార్టీల అధ్యక్షులు ఒక అడుగు ముందుకు నాలుగు అడుగులు వెనక్కు అన్న చందంగా వ్యవహరిస్తుండడం గమనార్హం. ఇలాంటి పరిస్థితుల్లో బలమున్నప్పటికీ అనైక్యత, సయోధ్య లేమి కారణంగా ఈ నియోజకవర్గంలో పుట్టి మునుగుతుందేమోనని పార్టీ శ్రేణులు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి.

అర్బన్, రూరల్‌లో ఆత్మీయ కలయికలు..

మారిన పరిణామాల నేపథ్యంలో నిజామాబాద్ అర్బన్ టికెట్టును షబ్బీర్ అలీకి కేటాయించేందుకు నిర్ణయించగా.. అభ్యర్థుల జాబితా విడుదల చేయకముందే అర్బన్ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ కలయిక నిర్వహించారు. షబ్బీర్ అలీ ఫామ్‌హౌజ్‌లో ఈ నెల 5న మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి సమక్షంలో ఈ సమోధ్య నిర్వహించారు. ఈ కలయికలో టికెట్టు ఆశించి భంగపడిన మాజీ మేయర్ సంజయ్, పీ సీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హందాన్, నగర అధ్యక్షుడు కేశవేణు సైతం ఉన్నారు. అందరూ కలిసి షబ్బీర్ గెలుపు కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తామని చెప్పడంతో పాటు మంగళవారం నగరంలో భారీ ప్రదర్శనకు రంగం సిద్ధం చేశారు. మరోవైపు రూరల్ నుంచి టికెట్టు ఆశించి భంగపడిన కాటిపల్లి నగేష్‌రెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్సీ అరికెలతో కలిసి అభ్యర్థి భూపతిరెడ్డి సమావేశం నిర్వహించారు. భూపతిరెడ్డి విజయంకోసం కృషిచేయాలని నగేష్‌రెడ్డి, నర్సారెడ్డిలు కార్యకర్తలకు పిలుపువ్వడం గమనార్హం.

బీసీ కులగణనపై నిర్లక్ష్యమేల?

- కాంగ్రెస్, బీజేపీవి ఉత్తుత్తి మాటలే..
- బీసీ కులగణనపై మోదీ ప్రకటన చేయాలి
- బోధన్ బీఆర్‌ఎస్ కుల సంఘాల గర్జన సభలో ఎమ్మెల్సీ కవిత



బోధన్ సభలో అభివాదం చేస్తున్న ఎమ్మెల్సీ కవిత

బోధన్ : ఎన్నికలొచ్చాయి కాబట్టి కాంగ్రెస్, బీజేపీ పార్టీల నాయకుల బీసీలపై మొసలి కన్నీళ్లు కారుస్తున్నారని, వారివన్నీ ఉత్తుత్తి మాటలేనని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. సోమవారం రాత్రి బోధన్‌లో ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి బీఆర్‌ఎస్ కుల సంఘాల గర్జన సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె ప్రసంగించారు. బీజేపీకి బీసీలపై నిజమైన ప్రేమ ఉంటే తక్షణమే బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు, ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీ కులగణనపై ప్రధాని మోదీ సానుకూల ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. రూ. 4 వేల కోట్లు ఖర్చు చేసి కాంగ్రెస్ హయాంలో చేసిన కులగణన నివేదికను ఆ పార్టీ బయట పెట్టలేదన్నారు. 2014లో కేసీఆర్ సమగ్ర కుటుంబ సర్వే చేపట్టి అందరి వివరాలు సేకరించారు కాబట్టే అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. జిల్లాలో గతంలో 19 స్కూళ్లు ఉంటే పదేళ్లలో వాటిని 82కు చేర్చామన్నారు. బీసీలకు రెండు స్కూళ్లే ఉండేవని, ప్రస్తుతం 23 స్కూళ్లు ఉన్నాయన్నారు. ఎన్నికలొస్తేనే కాంగ్రెస్ అభ్యర్థి బోధన్‌కు వస్తారని, షకీల్ ఎప్పుడూ బోధన్‌లోనే ఉంటారన్నారు.

రేటెంతరెడ్డి, ఈటలకు వాతలే..

సీఎం కేసీఆర్ ఒక పార్టీ అధ్యక్షుడు, జాతీయ నాయకుడు కాబట్టి రకరకాల వ్యూహాలతో రెండు చోట్ల పోటీ చేస్తున్నారని, పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లుగా రేటెంత రెడ్డి, ఈటల రాజేందర్ కూడా రెండు చోట్ల పోటీ చేస్తున్నారని, వారికి వాతలే మిగులుతాయని విమర్శించారు. సభలో ఎమ్మెల్యే షకీల్‌తో పాటు ఎంపీలు బీబీ పాటిల్, వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి బీఆర్‌ఎస్ నాయకుడు పొన్నాల లక్ష్మయ్య, కాసాని జ్ఞానేశ్వర్ ప్రసంగించారు. ఎమ్మెల్సీలు వీజీగౌడ్, రాజేశ్వర్ తదితరులున్నారు.

షబ్బీర్ అలీ చెల్లని రూపాయి..

- గంప చేతిలో నాలుగుసార్లు ఓడిండు..
- ఇప్పుడు బిగాల చేతిలో ఓడిపోతడు
- ఎమ్మెల్సీ కవిత



నగరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

నిజామాబాద్ నాగారం : అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డిలో చెల్లని రూపాయి నిజామాబాద్‌లో ఎలా చెల్లుతుందని, గంప గోవర్ధన్ చేతిలో నాలుగుసార్లు ఓడిన షబ్బీర్‌అలీ, ఇప్పుడు బిగాల గణేశ్ చేతిలో ఓడడం ఖాయమని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ అభ్యర్థులను ప్రజలు పట్టించుకోవట్లేదని కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టేవారితో సంబంధం లేదని జిల్లాలో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించుకుందామన్నారు. కామారెడ్డి నుంచి పారిపోయి వచ్చిన వ్యక్తిని అర్బన్‌లో ఆదరిద్దామా అని ప్రశ్నించారు. షబ్బీర్ అలీతో ఏమీ కాదన్నారు. ఓబీసీ రిజర్వేషన్ బిల్లు పార్లమెంటులో ఎందుకు ప్రవేశపెట్టలేదో బీజేపీ చెప్పాలన్నారు. జాతీయ బీసీ కమిషన్‌ను నిర్వీర్యం చేశారన్నారు.

మాది బీసీల ప్రభుత్వం

2004లోనే బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కష్ణయ్యను తీసుకొని అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్‌ను కలిసి ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్ వినతిపత్రం అందించారన్నారు. 20 ఏళ్లు గడిచినా దీనిపై స్పందన లేదన్నారు. సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జీల పోస్టుల్లో ఎంతమంది బీసీలున్నారని రాహుల్ అడిగారని, వారి హయాంలో బీసీ, ఎస్సీల ప్రాతినిథ్యం పెంచేందుకు ఏంచేశారో చెప్పాలన్నారు. తమది బీసీల ప్రభుత్వమన్నారు.

అంతకుముందు తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో ఆర్మూర్, అర్బన్ ఎమ్మెల్యేలు జీవన్ రెడ్డి, బిగాల గణేశ్‌గుప్తా, మేయర్ దండు నీతూ కిరణ్, క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ రాజేశ్వర్, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, మాజీ నుడా చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, రెడ్కో మాజీ చైర్మన్ ఎస్ఏ అలీం, జెడ్పీటీసీ జగన్ తదితరులున్నారు.

మిగిలింది నాలుగు రోజులే..

మూడోరోజు 12 నామినేషన్లు దాఖలు..

సుభాష్‌నగర్ : అసెంబ్లీ ఎన్నికలు– 2023 నామినేషన్ల దాఖలుకు గడువు ఇంకా నాలుగు రోజులే మిగిలి ఉంది. మూడోరోజు సోమవారం జిల్లాలోని ఆరు అసెంబ్లీ స్థానాలకు 12 మంది నామినేషన్లు దాఖలు చేశారు. బాల్కొండ, బాన్సువాడలో ముగ్గురు చొప్పున, ఆర్మూర్, బోధన్, నిజామాబాద్ అర్బన్‌లో రెండు చొప్పున దాఖలయ్యాయి. మంత్రి ప్రశాంత్ రెడ్డి బాల్కొండలో నామినేషన్ వేశారు. 8, 9వ తేదీల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు ముహూర్తం ఖరారు చేసుకున్నట్లు తెలిసింది. ఆర్మూర్‌లో స్వతంత్ర్య అభ్యర్థిగా గంగాధర్ మ్యాక, ఉత్తర రాష్ట్ర తెలంగాణ పార్టీ తరపున సాయన్న బొంత నామినేషన్లు వేశారు. బోధన్ నుంచి ఏఐఎంఐఎం నుంచి మహ్మద్ షార్జీల్ పర్వేజ్, బీజేపీ నుంచి వడ్డి మోహన్‌రెడ్డి, బాన్సువాడలో స్వతంత్ర్య అభ్యర్థిగా పుట్ట భాస్కర్, కాంగ్రెస్ తరపున బాల్‌రాజు కాసుల, కాసుల రోహిత్ నామినేషన్లు దాఖలు చేశారు. అర్బన్‌లో స్వతంత్ర్య అభ్యర్థిగా మహ్మద్ జహీరుద్దీన్, కాంగ్రెస్ నుంచి మహ్మద్ షబ్బీర్ అలీ తరపున స్థానిక నాయకులు నామినేషన్ పత్రాలు అందజేశారు. బాల్కొండలో సునీల్ కుమార్ తరపున నామినేషన్ వేశారు. ధర్మ సమాజ్ పార్టీ తరపున మంగ్లారం భోజన్న నామినేషన్లు దాఖలయ్యాయి. రూరల్‌లో ఒక్క నామినేషన్ దాఖలు కాలేదు. పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు.



అర్బన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి షబ్బీర్ తరపున నామినేషన్ వేసేందుకు వెళ్తున్న నాయకులు

వీఐపీ సెగ్మెంట్!

- కామారెడ్డిలో సీఎం, పీసీసీ చీఫ్‌ల పోటీ
- బీజేపీ నుంచీ బలమైన అభ్యర్థి



సాక్షి, కామారెడ్డి: బీఆర్‌ఎస్ అభ్యర్థిగా సీఎం కేసీఆర్, కాంగ్రెస్ అభ్యర్థిగా పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి పోటీ చేస్తుండడంతో కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గం వీఐపీల సెగ్మెంట్‌గా మారింది. బీజేపీ సైతం బలమైన అభ్యర్థిని రంగంలోకి దింపడంతో పోటీ రసవత్తరంగా మారింది. బీజేపీ అభ్యర్థిగా జెడ్పీ మాజీ చైర్మన్ కాటిపల్లి వెంకటరమణారెడ్డి బరిలో ఉన్నారు. ఆయన చాలా కాలంగా జనంలో ఉన్నారు. బీజేపీలో చేరికలపై ఫోకస్ చేశారు. వెంకటరమణారెడ్డి బుధవారం నామినేషన్ వేయనున్నారు. ఆయన తరపున ప్రచారం చేయడానికి పార్టీకి చెందిన ప్రముఖులు వచ్చే అవకాశాలున్నాయి.

9న కేసీఆర్ నామినేషన్, సభ

బీఆర్‌ఎస్ అభ్యర్థిగా సీఎం కేసీఆర్ ఈనెల 9న నామినేషన్ దాఖలు చేయనున్నారు. అనంతరం భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. అక్కడ జరిగే బహిరంగ సభలో సీఎం కేసీఆర్ ప్రసంగిస్తారు. బహిరంగ సభకు భారీగా జనాన్ని సమీకరించేందుకు బీఆర్‌ఎస్ కసరత్తు చేస్తోంది. సభకు మంత్రి కేటీఆర్‌తో పాటు బీఆర్‌ఎస్‌కు చెందిన ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు భారీ సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉంది.

10న రేవంత్ నామినేషన్, సభ

పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఈనెల 10న నామినేషన్ దాఖలు చేయనున్నారు. అదే రోజు జిల్లా కేంద్రంలో బీసీ డిక్లరేషన్ కోసం భారీ బహిరంగ సభకు ప్లాన్ చేశారు. ఈ సభకు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య హాజరవుతారని పార్టీ నాయకులు తెలిపారు. రాష్ట్రం నలుమూలల నుంచి కాంగ్రెస్ పార్టీకి చెందిన బీసీ నేతలు, శ్రేణులు హాజరయ్యే అవకాశం ఉంది.

కాంగ్రెస్ అభ్యర్థులు ఖరారు

- మూడో జాబితా విడుదల
- కామారెడ్డి నుంచి రేవంత్‌రెడ్డి, బాన్సువాడలో ఏనుగు..
- జుక్కల్ టికెట్టు లక్ష్మీకాంత్‌రావ్‌కు..
- అర్బన్ షబ్బీర్ అలీకి కేటాయింపు

సాక్షి, కామారెడ్డి: కాంగ్రెస్ పార్టీ ఎట్టకేలకు అభ్యర్థులను ఖరారు చేసింది. ఉమ్మడి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న నాలుగు స్థానాలనుంచి బరిలో నిలిచేవారి పేర్లను ప్రకటించింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో తొమ్మిది నియోజకవర్గాలు ఉండగా.. తొలి రెండు జాబితాలలో ఆర్మూర్, బాల్కొండ, బోధన్, నిజామాబాద్ రూరల్, ఎల్లారెడ్డి అభ్యర్థులను ఖరారు చేసిన విషయం తెలిసిందే. మిగతా స్థానాలకు సోమవారం అభ్యర్థులను ప్రకటించింది. ప్రచారంలో ఉన్నట్లే కామారెడ్డి బరిలో పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఉన్నారు. ఇక్కడినుంచి పార్టీ టికెట్టు ఆశించిన షబ్బీర్ అలీకి నిజామాబాద్ అర్బన్ స్థానాన్ని కేటాయించారు. బాన్సువాడ టికెట్టు ఏనుగు రవీందర్‌రెడ్డికి, జుక్కల్ టికెట్టు తోట లక్ష్మీకాంతరావ్‌కు కేటాయిస్తూ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సోమవారం జాబితా విడుదల చేశారు. బాన్సువాడ నుంచి పోటీ చేయడానికి పలు వురు నేతలు ఆసక్తి చూపారు. అయితే స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని ఢీకొట్టేందుకు బలమైన అభ్యర్థిని దింపాలని భావించిన పార్టీ.. ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది. జుక్కల్‌లో మాజీ ఎమ్మెల్యే గంగారాంతోపాటు తోట లక్ష్మీకాంతరావ్ టికెట్టు ఆశించినా అధిష్టానం లక్ష్మీకాంతరావ్‌వైపే మొగ్గు చూపింది.

జుక్కల్ నియోజకవర్గం:



అభ్యర్థి పేరు : తోట లక్ష్మీకాంతరావు
భార్య: అర్చన తోట
విద్యార్హత: ఎంఏ, పీహెచ్‌డీ
రాజకీయ ప్రస్థానం: తొలిసారిగా ఎన్నికల బరిలో దిగుతున్నారు.

కాంగ్రెస్ టికెట్టు కోసం జుక్కల్ మాజీ ఎమ్మెల్యే గంగారాం ప్రయత్నించారు. టికెట్టు దక్కకపోవడంతో ఏ నిర్ణయం తీసుకుంటారోనని చర్చ నడుస్తోంది.

బాన్సువాడ :



అభ్యర్థి పేరు : ఏనుగు రవీందర్‌రెడ్డి
భార్య : మంజులారెడ్డి. ఒక కొడుకు, కూతురు
స్వగ్రామం : తాడ్వాయి మండలంలోని ఎర్రాపహాడ్
రాజకీయ ప్రస్థానం :

- 2004లో ఎల్లారెడ్డి నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు.
- తెలంగాణ కోసం 2008లో రాజీనామా. ఉప ఎన్నికలలో కాంగ్రెస్ చేతిలో ఓటమి.
- 2009లో తిరిగి ఎమ్మెల్యే.
- 2010లో తెలంగాణ కోసం మరోసారి రాజీనామా. ఉపఎన్నికల్లో విజయం. 2014లో విజయం
- 2018లో కాంగ్రెస్ అభ్యర్థి చేతిలో ఓటమి. తరువాత బీఆర్‌ఎస్‌ను వీడి బీజేపీలో చేరిక.
- ఇటీవలే కాంగ్రెస్‌లో చేరిక.

నిజామాబాద్ అర్బన్



అభ్యర్థి పేరు : షబ్బీర్ అలీ
భార్య : నఫీస్ పర్వీన్
కొడుకు : ఇలియాస్, ఇద్దరు కూతుళ్లు
రాజకీయ ప్రస్థానం :

- 1987లో మాచారెడ్డి ఎంపీపీగా పోటీ, ఓటమి
- 1989లో కామారెడ్డి నుంచి ఎమ్మెల్యేగా గెలుపు. అప్పటి మర్రి చెన్నారెడ్డి క్యాబినెట్‌లో మంత్రిగా పనిచేశారు.
- 1994, 1999 ఎన్నికలలో ఓటమి.
- 2004 గెలుపు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి క్యాబినెట్‌లో విద్యుత్తు శాఖ మంత్రి.
- 2009 ఎన్నికలతో పాటు 2014, 2018 ఎన్నికల్లోనూ ఓటమి. శాసనమండలి సభ్యుడిగా ఎన్నిక, మండలిలో విపక్ష నేతగా బాధ్యతలు.
- 2023లో నిజామాబాద్ అర్బన్ అభ్యర్థిత్వం.

క్లుప్తంగా

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీతో పాటు అనుబంధ డిగ్రీ, పీజీ కళాశాలల్లో విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని రిజిస్ట్రార్ యాదగిరి హెచ్చరించారు. తెయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ ఆదేశాల మేరకు సోమవారం యూనివర్సిటీ యాంటీ ర్యాగింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. అనంతరం యాంటీ ర్యాగింగ్ పోస్టర్లను ఆవిష్కరించారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ విద్యార్థులను శారీరిక, మానసిక, లైంగిక, ఒత్తిడికి గురిచేస్తే చట్టరీత్యా నేరంగా పరిగణిస్తారని తెలిపారు. క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. తెయూ యాంటీ ర్యాగింగ్ కమిటీ చైర్‌పర్సన్‌గా ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ, వైస్ చైర్మన్‌గా రిజిస్ట్రార్ యాదగిరి, కన్వీనర్‌గా ప్రిన్సిపాల్ సీహెచ్ ఆరతి, సభ్యులుగా అధ్యాపకులు కె రవీందర్‌రెడ్డి, ఎంబీ భ్రమరాంబిక, జి బాలకిషన్, ఎ పున్నయ్య, గుల్ ఈ రానా, మహేందర్ ఐలేని, కె కిరణ్మయి, కిరణ్ రాథోడ్‌ను నియమించారు.

అసిస్టెంట్ రిజిస్ట్రార్లకు స్థానచలనం

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ సాయాగౌడ్, విజయలక్ష్మి స్థానచలనం పొందారు. సాయాగౌడ్ పరీక్షల నియంత్రణ విభాగం, ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్ ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. విజయలక్ష్మి సారంగపూర్ బీఈడీ కాలేజీలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రిజిస్ట్రార్ యాదగిరి ఆదేశాల మేరకు విజయలక్ష్మిని పరీక్షల నియంత్రణ విభాగానికి, సాయాగౌడ్‌ను ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్‌కు బదిలీ చేశారు. సోమవారం వీరు బాధ్యతలు చేపట్టారు.

కామర్స్‌లో కాత్యాకు డాక్టరేట్



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ కామర్స్ విభాగంలో పరిశోధకురాలు వడ్డేపల్లి కాత్యా పీహెచ్‌డీ సాధించారు. తెయూ కామర్స్ డీన్ జి రాంబాబు పర్యవేక్షణలో 'ఇంపాక్ట్ ఆఫ్ కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్ ఆన్ కస్టమర్ రిటెన్షన్ అండ్ సాటిస్‌ఫాక్షన్ ఇన్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా– ఏ స్టడీ' అనే అంశంపై కాత్యా పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. సోమవారం తెయూలో నిర్వహించిన ఓపెన్ వైవావోస్‌కు ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ రవికుమార్ ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో తెయూ రిజిస్ట్రార్ యాదగిరి, డీన్ రాంబాబు, అధ్యాపకులు శ్రీనివాస్, శ్వేత, గంగాధర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఒకరి అదృశ్యం



రాజు

నిజామాబాద్ రూరల్: నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చక్రధర్‌నగర్ తండాకు చెందిన బదావత్ రాజు అదృశ్యమైనట్లు ఎస్‌హెచ్‌వో మహేశ్‌కుమార్ సోమవారం తెలిపారు. రాజు చెవిటి, మూగవాడు. సైగలతోనే ఇతరుల భావాలను అర్థం చేసుకుంటాడు. అక్టోబర్ 30న ఇంట్లో నుంచి వెళ్లిన రాజు తిరిగి రాలేదు. పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బీడీ కార్మికులే కీలకం

- తమవైపు తిప్పుకునేందుకు అధికార పార్టీ ప్రణాళిక
- జిల్లాలో బీడీ కార్మికులు 2.75 లక్షలకు పైమాటే..
- జీవన భృతి అందుకుంటున్న కార్మికులు, టేకేదార్లు 98,837 మంది

మోర్తాడ్(బాల్కొండ) : జిల్లాలో వ్యవసాయం తర్వాత అత్యధికంగా మహిళలు ఆధారపడింది బీడీ పరిశ్రమపైనే. బీడీలు చుడుతూ జీవనం సాగిస్తున్న కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం ఆసరా పథకం కింద జీవన భృతిని అందిస్తుండగా లబ్ధి పొందుతున్న కార్మికులను తమవైపు తిప్పుకునే పనిలో అధికార పార్టీ అభ్యర్థులు నిమగ్నమయ్యారు. ప్రతి నియోజకవర్గంలో 20వేల మందికి మించి బీడీ కార్మికులు జీవన భృతిని అందుకుంటుండటంతో వారి ఓట్లు గంపగుత్తాగా తమ పార్టీకే వచ్చేలా ప్రయత్నాలు మొదలు పెట్టారు. బీడీ కార్మికులతో పాటు వారి కుటుంబ ఓట్లు రాబట్టుకుంటే గెలుపు నల్లేరు మీద నడకేనని రాజకీయ పరిశీలకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అభ్యర్థుల గెలుపు ఓటములను నిర్దేశించే విషయంలో బీడీ కార్మికుల ఓట్లు కీలకం కావడంతో ప్రతి కార్మికురాలిని అధికార పార్టీ నాయకులు స్వయంగా కలుసుకుని ఓట్లు రాబట్టుకునే పనిలో ఉన్నారు. జిల్లాలో బీడీ పరిశ్రమను నమ్ముకుని దాదాపు 2.75లక్షల మంది కార్మికులు ఉన్నారు. వీరిలో బీడీలు చుట్టేవారు ఎక్కువ మంది ఉంటే బీడీ కంపెనీల్లో పని చేసే మగవారు తక్కువ మంది ఉన్నారు. జీవనభృతి మాత్రం బీడీలు చేసేవారికి, టేకేదారులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుంది. ప్యాకర్లు, బట్టీ కార్మికులకు గతంలో ఇచ్చినా మళ్లీ రద్దు చేశారు.



జీవనభృతి అందుకుంటున్న బీడీకార్మికులు	
ఆర్మూర్ నియోజకవర్గం	21,637
బాల్కొండ	28,044
నిజామాబాద్ రూరల్	26,421
బోధన్	10,768
నిజామాబాద్ అర్బన్	7,031
బాన్సువాడ	4,322
టేకేదార్లు	614
మొత్తం	98,837

భృతి పొందని వారు వేలల్లో..

బీడీ భృతి పొందని కార్మికుల సంఖ్య ప్రతి నియోజకవర్గంలో 15 వేలకు మించి ఉంది. పీఎఫ్‌కు కటాఫ్ తేదీ ఎత్తివేసిన తర్వాత కొత్త పింఛన్ల మంజూరు కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో అనేక మంది బీడీ కార్మికులకు జీవన భృతి అందడం లేదు. ఇప్పుడు జీవన భృతికి నోచుకోని వారికి ఎన్నికల తర్వాత ఎలాగైనా మంజూరు చేయిస్తామని అధికార పార్టీ నాయకులు హామీ ఇస్తున్నారు. బీడీ కార్మికుల ఓట్లను ఏకపక్షంగా రాబట్టుకుంటే తమ గెలుపు సులభం అని అధికార పార్టీ నాయకులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా జీవన భృతికి నోచుకోని కార్మికులను ప్రసన్నం చేసుకుంటే తమకే ఆ ఓట్లు పడతాయని ప్రతిపక్ష పార్టీల నాయకులు ఆశిస్తున్నారు. ఏదేమైనా అభ్యర్థుల గెలుపు ఓటములను బీడీ కార్మికులు ప్రభావితం చేసే స్థాయికి ఎదగడం ఎలాంటి మార్పుకు అవకాశం ఇస్తుందో వేచి చూడాల్సి ఉంది.

ఎన్నికల్లో మైసూర్ సిరా



ఆర్మూర్: ఎన్నికల సమయంలో ఓటరు చేతి వేలిపై సిరా గుర్తు పెట్టడం ఒక ఆనవాయితీ. దొంగ ఓట్లను నివారించడానికి ఇదో ప్రయత్నం. ఒక సారి వేలిపై సిరా చుక్క పడితే కనీసం నెల రోజుల వరకు దాని ఆనవాలు చెక్కు చెదరకుండా ఉంటుంది. ఇంతటి ప్రాధాన్యత సంతరించుకున్న సిరాకు గొప్ప చరిత్రనే ఉంది.

- కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన మైసూర్ పెయింట్ అండ్ వార్నిష్ లిమిటెడ్ (ఎంపీవీఎల్) ఈ సిరాను తయారు చేస్తోంది. సబ్బులు, నూనెలతో పాటు ఏ విధమైన రసాయనాలు ఉపయోగించినా ఈ గుర్తును చెరిపేయడం సాధ్యం కాకపోవడంతో ఎన్నికల కమిషన్, ప్రభుత్వం ఈ సిరా వినియోగాన్ని చేపట్టారు.
- భారత ఎన్నికల సంఘం, నేషనల్ ఫిజికల్ లేబొరేటరీ, నేషనల్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సాయంతో తయారు చేసిన ఈ సిరా ఉత్పత్తి సరఫరాలకు 1963లో ఎంపీవీఎల్ ప్రత్యేక లైసెన్స్‌ను పొందింది. అప్పటి నుంచి ఎన్నికల కమిషన్‌కు ఈ సిరాను ఎంపీవీఎల్ సరఫరా చేస్తోంది. 1976 నుంచి మరో 28 దేశాలకు కూడా ఇక్కడి నుంచి సిరా సరఫరా అవుతోంది.
- 2009 సార్వత్రిక ఎన్నికలకు పది మి.లీ. పరిమాణం కలిగిన సుమారు 20 లక్షల సీసాలను ఎంపీవీఎల్ సరఫరా చేసింది. ఒక్క ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోనే 2.88 లక్షల సీసాలను ఉపయోగించారు.
- 2006 ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి ఓటరుకు ఎడమచేతి చూపుడు వేలు గోరు పైభాగం నుంచి కింది వరకు సిరాతో గీత గీయడం ప్రారంభించారు. అంతకు ముందు గోరు కింద ఉండే చర్మంపై గుర్తు పెట్టే వారు.
- సిరాలోని సిల్వర్ నైట్రేట్‌కు సూర్యరశ్మి తగలగానే స్పష్టమైన గుర్తు ఏర్పరుస్తుంది. ఈ గుర్తును చర్మ కణాలను మారిస్తే తప్ప చెరిపవేయలేము.

'షకీల్‌ను మరోసారి గెలిపించాలి'



బోధన్ కుల సంఘాల గర్జన సభలో స్టెప్పులేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

బోధన్/ బోధన్‌టౌన్: బోధన్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి మహ్మద్ షకీల్‌ను మరోసారి గెలిపించాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కోరారు. బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్ ఎన్‌ఎస్‌ఎఫ్ మైదానంలో సోమవారం నిర్వహించిన నియోజకవర్గ కుల సంఘాల గర్జన సభలో ఆమె మాట్లాడారు. సీఎం కేసీఆర్ అన్ని వర్గాల సంక్షేమం కోసం ఆలోచిస్తారన్నారు. రాష్ట్రం మరింత ఎదిగే రోజులు ముందున్నాయని పేర్కొన్నారు. ఎల్లప్పుడు అందుబాటులో ఉండే షకీల్ కావాలా? లేక సుదర్శన్‌రెడ్డి కావాలా? నియోజకవర్గ ప్రజలు ఆలోచించుకోవాలని కోరారు. కవితతో పాటు ఎంపీలు బీబీపాటిల్, వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్సీలు వీజీగౌడ్, రాజేశ్వర్, బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు పొన్నాల లక్ష్మయ్య, కాసాని జ్ఞానేశ్వర్ సభకు విచ్చేసి మాట్లాడారు.

ఎంతో అభివృద్ధి చేశారు

70 ఏళ్లలో జరగని అభివృద్ధిని కేసీఆర్ తన పాలనలో చేసి చూపారని జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ అన్నారు. అనేక సంక్షేమ పథకాలను కేసీఆర్ అమలు చేశారన్నారు. కేసీఆర్ నాయకత్వాన్ని బలపర్చి మళ్లీ షకీల్‌ను గెలిపించాలన్నారు.

కాంగ్రెస్‌కు ఓటెయ్యొద్దు

బీసీలకు సీట్లు ఇవ్వని కాంగ్రెస్‌కు ఓటెయ్యొద్దని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అన్నారు. ఉమ్మడి జిల్లాలో జుక్కల్(ఎస్సీ) మినహాయించి ఎనిమిది సీట్లుంటే బీసీ నాయకులకు ఏ ఒక్క సీటు ఇవ్వలేదన్నారు. కేసీఆర్ హయాంలోనే బీసీలకు నిజమైన ఆత్మగౌరవం దక్కిందన్నారు.

ఆ ఘనత కేసీఆర్‌కే దక్కుతోంది

ఎన్నికల సందర్భంలో అన్నీ పార్టీలు బీసీ నినాదం, కుల గణన అంశాన్ని ముందుకు తెస్తున్నాయి కానీ బీసీల కుల గణన, అభ్యున్నతి కోసం ఆలోచించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతోందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య అన్నారు. అవసరాల కోసం బీసీ నినాదం తెరపైకి తెచ్చే వారిని నమ్మి మోసపోవద్దన్నారు. వ్యవసాయానికి 3 గంటల కరెంట్ సరిపోతుందని మాట్లాడే వారికి అధికారం అప్పగిస్తే పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవాలన్నారు. పార్టీ రాష్ట్ర నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతు మళ్లీ కేసీఆర్‌ను సీఎం చేసేందుకు అన్నీ వర్గాల ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు.

ఆశీర్వదించండి.. సేవ చేస్తా

తనను మరోసారి ఆశీర్వదిస్తే ప్రజలకు సేవ చేస్తానని ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ కోరారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుంటూ ప్రభుత్వం అందించే ప్రతీ సంక్షేమ పథకాలను గడపగడపకు అందిచేలా కృషి చేస్తున్నానని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్‌కు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.

నిరుద్యోగుల తరఫున నామినేషన్లు



కామారెడ్డిలో మాట్లాడుతున్న టీయూపీఈటీఏ ప్రతినిధులు

కామారెడ్డి క్రైం: తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగుల పట్ల వివక్ష చూపించిందని టీయూపీఈటీఏ రాష్ట్ర అధ్యక్షుడు మాదగోని సైదులుగౌడ్ ఆరోపించారు. అందుకే నిరుద్యోగులు, ప్రైవేటు పీఈటీ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 119 నియోజకవర్గాలలో నామినేషన్లు వేస్తామన్నారు. సోమవారం కామారెడ్డిలో ఆయన మాట్లాడారు. అసోసియేషన్ తరఫున కామారెడ్డిలో భార్గవి నామినేషన్ వేశారని తెలిపారు. రాష్ట్రంలో ఉద్యోగాలు నోటిఫికేషన్లు లేవని, నోటిఫికేషన్ వస్తే కోర్టు కేసులతో తాత్సారం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. 2017లో 616 గురుకుల పీఈటీ ఉద్యోగాలకు నోటిఫికేషన్‌లు ఇచ్చి పరీక్షలు పెట్టారని, నియామకాలు చేపట్టకుండా కోర్టు కేసులను సాకుగా చూపిస్తూ అభ్యర్థులను ప్రభుత్వం దగా చేసిందన్నారు. గతంలో ఎన్నోసార్లు టీఎస్‌పీఎస్సీ, అసెంబ్లీ, ప్రగతిభవన్‌లను ముట్టడించామన్నారు. అయినప్పటికీ ఏవరూ స్పందించడం లేదన్నారు. అందుకే నామినేషన్లు వేస్తున్నామని తెలిపారు.

కార్తీక దీక్షలోకి బాలయోగి కృష్ణ మహరాజ్



దీక్షలోకి వెళ్తున్న బాలయోగి కృష్ణ మహరాజ్

నిజామాబాద్ రూరల్/నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం మల్లారం శ్రీ లింగేశ్వర గుట్ట ఆశ్రమం శ్రీ బాలయోగి కృష్ణ మహరాజ్ సోమవారం కార్తీక మాస దీక్షలోకి వెళ్లారు. ప్రతి సంవత్సరం కార్తీక మాసం పురస్కరించుకుని మహరాజ్ 16 రోజులపాటు ఎవరికి దర్శనం ఇవ్వకుండా దీక్షలోకి వెళ్తారు. ఈ సందర్భంగా గుట్టకు వచ్చిన శ్రీ మధుసూదనంద సరస్వతి స్వామి బాలయోగి కృష్ణ మహరాజ్‌ను ఆశీర్వదించారు. స్వామీజీ 26న భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. అనంతరం 27న ఉదయం 5.15 గంటలకు తన భక్త బృందంతో కలిసి ఆశ్రమం నుంచి కందకుర్తి త్రివేణి సంగమం వరకు పాదయాత్రగా వెళ్తారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా



నిజామాబాద్‌నాగారం: సిద్దిపేటలో జరిగిన రాష్ట్రస్థాయి రూరల్ గేమ్స్‌లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. అండర్–14, 19 విభాగంలో ఖోఖో, కబడ్డీలో జిల్లా బాలుర జట్టు ప్రథమస్థానం, అండర్–14 బాలికల విభాగంలో కబడ్డీ జట్టు ప్రథమ స్థానంలో నిలిచాయి. క్రీడాకారులను రూరల్ గేమ్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అబ్బాగోని అశోక్‌గౌడ్, భాస్కర్, బుస్స మహేష్, దత్తు అభినందించారు. ఈ జట్టుకు కోచ్‌లుగా చందు, రంజిత్, మేనేజర్‌గా పుష్పలత వ్యవహరించారు.

పోలీసుల కవాతు



నందిపేటలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు



నవీపేటలో..

నందిపేట్/నవీపేట: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సోమవారం నందిపేట, నవీపేట మండల కేంద్రాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి సహకరించాలని కోరారు. ప్రజలు భయాందోళనకు గురికాకుండా, ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో ఆర్మూర్ రూరల్ సీఐ గోవర్ధన్ రెడ్డి, నందిపేట ఎస్సై శ్రీకాంత్, ఆర్‌ఏఎఫ్ కమాండెంట్ జితేంద్రనందువార్, నిజామాబాద్ నార్త్ టౌన్ సీఐ సతీష్, నవీపేట ఎస్సై యాదగిరి గౌడ్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం



బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్‌లో గోదావరి పుష్కర ఘాట్ వద్ద సోమవారం గుర్తు తెలియని మహిళ మృతదేహం లభించింది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాలు.. పుష్కర ఘాట్ వద్ద 35 నుంచి 40 ఏళ్ల మహిళ మృతదేహం ఉందని సమాచారం అందడంతో వెళ్లి వెలికి తీశామన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆకట్టుకున్న మణికంఠ చిత్రాలు





సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్ నగరంలోని సూర్యనగర్‌కు చెందిన మణికంఠ అనే తొమ్మిదో తరగతి విద్యార్థి తన వద్ద ఉన్న కలర్స్‌తో గీసిన చిత్రాలు ఆకట్టుకుంటున్నాయి. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, బీజేపీ నిజామాబాద్ అర్బన్ అభ్యర్థి ధన్‌పాల్ సూర్యనారాయణ చిత్రాలు గీసి తన అభిమానాన్ని చాటుకున్నాడు.

గంజాయి విక్రేతల అరెస్టు

- 3.2 కిలోల గంజాయి స్వాధీనం



నిందితులను చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

బాన్సువాడ: బాన్సువాడ ఎక్సైజ్ పరిధిలో నలుగురి నుంచి సోమవారం 3 కిలోల 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ యాదగిరిరెడ్డి తెలిపారు. బాన్సువాడకు చెందిన వెంకటేష్, పిట్లంకు చెందిన రాజు బాన్సువాడ ఫిష్ మార్కెట్ వద్ద గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో అక్కడి వెళ్లి వారిని పట్టుకున్నామని చెప్పారు. వారి వద్ద ఉన్న 300 గ్రామాలు గంజాయిని స్వాధీనం చేసుకుని విచారించగా మెదక్ జిల్లా మారెడ్‌కు చెందిన బాలప్ప వద్ద గంజాయి కొనుగోలు చేశామని చెప్పారని తెలిపారు. దీంతో మారెడ్ గ్రామానికి వెళ్లి బాలప్పను అదుపులోకి తీసుకొని, 200 గ్రాముల గంజాయిని పట్టుకున్నట్లు చెప్పారు. బాలప్పను విచారించగా పిట్లంకు చెందిన ఇబ్రహీం వద్ద గంజాయి కొనుగోలు చేస్తానని చెప్పడంతో ఇబ్రహీంను అదుపులోకి తీసుకుని 2 కిలోల 700 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని వివరించారు.రాజు,వెంకటేష్, బాలప్ప, ఇబ్రహీంలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎక్సైజ్ ఎస్సై తేజస్వీని, సిబ్బంది ఉన్నారు.

తనిఖీల్లో నగదు స్వాధీనం



భిక్కనూరులో పట్టుకున్న నగదుతో పోలీసులు

భిక్కనూరు: భిక్కనూరు సమీపంలోని జాతీయ రహదారిపై ఉన్న చెక్‌పోస్టు వద్ద సోమవారం రెండు వాహనాలన నుంచి డబ్బులను స్వాధీనం చేసుకున్నట్లు భిక్కనూరు ఎస్సై సాయికుమార్ తెలిపారు. మెదక్ పట్టణానికి చెందిన హుస్సేన్ వాహనం నుంచి రూ.2.10 లక్షలు, సికిందరాబాద్‌కు చెందిన దేవానందరెడ్డి నుంచి రూ.71వేలు స్వాధీనం చేసుకుని టాస్కుఫోర్సు సిబ్బందికి అప్పగించినట్లు ఎస్సై వివరించారు.

మోపాల్‌లో..

మోపాల్: మోపాల్ చౌరస్తాలో అదేగ్రామానికి చెందిన షేక్ సలీం నుంచి రూ.2,16,730 నగదును పట్టుకున్నట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు. నగదుకు సంబంధించి సరైన ధ్రువపత్రాలు లేకపోవడంతో సీజ్ చేసి ట్రెజరీ కార్యాలయంలో జమ చేసినట్లు పేర్కొన్నారు.

బైక్ చోరీ

బాన్సువాడ రూరల్: మండలంలోని దేశాయిపేట్‌కు చెందిన బేపారి సాయికుమార్ బైక్ చోరీకి గురైంది. బాన్సువాడలోని జ్యోతిక రెస్టారెంట్ ఎదుట నిలిపిన బైక్‌ను ఎత్తుకెళ్లినట్లు బాధితుడు సోమవారం ఫిర్యాదు చేశాడని సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం రాత్రి రెస్టారెంట్ వద్ద బైక్ నిలిపి ఫుడ్ పార్శిల్ తీసుకుని వచ్చి చూసే సరికి ద్విచక్ర వాహనం మాయమైందన్నారు.

క్రైం కార్నర్

బస్సు ఢీకొని వృద్ధురాలి మృతి



రుక్కవ్వ మృతదేహం

బాన్సువాడ రూరల్: బాన్సువాడ బస్టాండ్‌లో సోమవారం మధ్యాహ్నం బస్సు ఢీకొని రాజబోయిన రుక్కవ్వ(80) మృతి చెందింది. బాన్సువాడలోని అబ్కారి కార్యాలయంలో స్వీపర్‌గా పనిచేసే రుక్కవ్వ రోజులాగే బస్టాండ్ ప్రాంగణం నుంచి నడుచుకుంటూ వెళ్తుండగా అటువైపు వేగంగా వచ్చిన బస్సు ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలైన రుక్కవ్వను బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలి కుమారుడు సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ..

మోపాల్: మండలంలోని కాల్పోల్‌కు చెందిన శైలజ (38) ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు. వివరాలు.. శైలజ, తన కొడుకుతో కలిసి మూడ్రోజుల క్రితం బైక్‌పై నిజామాబాద్‌కు వెళ్తుండగా రోడ్డుపై ఉన్న ధాన్యం కుప్ప వద్ద అదుపు తప్పి కిందపడ్డారు. ప్రమాదంలో శైలజ తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో సోమవారం శైలజ మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. రోడ్లపై వడ్లు ఆరబెడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాల్కొండకు చెందిన ఒకరు..

బాల్కొండ: బాల్కొండకు చెందిన సుముకం దశరథ్(45) జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతు సోమవారం మృతి చెందాడు. ఎస్సై గోపి తెలిపిన వివరాలు.. దశరథ్ శనివారం రాత్రి స్కూటీపై ఆర్మూర్ వైపు వెళ్తుండగా కుక్క అడ్డురావడంతో అదుపు తప్పి పడిపోయాడు. దీంతో ఆయన తలకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా సోమవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆత్మహత్య

నవీపేట: మండలంలోని పోతంగల్ శివారులో రంగారెడ్డి జిల్లా వనస్థలిపురం ప్రాంతానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి బుడ్డా వెంకటసుబ్బారెడ్డి(52) సోమవారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. వివరాలు.. వెంకటసుబ్బారెడ్డి తన అత్తగారి ఊరైన మండలంలోని కమలాపూర్‌కు వచ్చాడు. పోతంగల్ వైపు నడుచుకుంటూ వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన రియల్ ఎస్టేట్ వ్యాపారంలో నష్టపోవడంతో కొన్ని రోజులుగా మనో వేధనకు గురవుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డారని ఎస్సై పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

టిప్పర్ ఢీకొని ఇద్దరికి గాయాలు

రెంజల్: మండలంలోని కందకుర్తిలో సోమవారం టిప్పర్ ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలు.. మహారాష్ట్రలోని ధర్మాబాద్ తాలూకా రత్నేల్లి గ్రామానికి చెందిన దంపతులు ఇద్దరు పిల్లలతో రెంజల్ మండలం దూపల్లిలోని బంధువుల ఇంటికి వస్తున్నారు. కందకుర్తి వద్ద వీరి బైక్‌ను టిప్పర్ ఢీకొనడంతో మహిళకు, ఆమె కుమారుడికి గాయాలయ్యాయి. స్థానికులు టిప్పర్ డ్రైవర్‌ను పట్టుకుని చితకబాదారు. విషయం తెలుసుకున్న పోలీసులు టిప్పర్‌ను డ్రైవర్‌తో పాటు స్టేషన్‌కు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్సై ఉదయ్ కుమార్ తెలిపారు.

సాక్షి స్పోర్ట్స్
మంగళవారం
7-11-2023



పారిస్ ఒలింపిక్స్ హాకీ క్వాలిఫయింగ్ టోర్నీ: భారత్‌కు కఠిన సవాలు

వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్ క్రీడలకు అర్హత సాధించేందుకు భారత మహిళల హాకీ జట్టు శ్రమించాల్సి ఉంటుంది. జనవరి 13 నుంచి 19 వరకు రాంచీలో జరిగే ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ టోర్నీ-1కు సంబంధించిన వివరాలను అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్‌ఐహెచ్) సోమవారం విడుదల చేసింది. ప్రపంచ ఆరో ర్యాంకర్ భారత్‌తోపాటు ఈ టోర్నీలో ప్రపంచ ఐదో ర్యాంకర్ జర్మనీ, న్యూజిలాండ్ (9), జపాన్ (11), చిలీ (14), అమెరికా (15), ఇటలీ (19), చెక్ రిపబ్లిక్ (25) జట్లు బరిలో ఉన్నాయి. ఈ టోర్నీలో స్వర్ణ, రజత, కాంస్య పతకాలు నెగ్గిన మూడు జట్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తాయి. జనవరి 13 నుంచి 20 వరకు స్పెయిన్‌లోని వాలెన్సియాలో ఎనిమిది జట్ల (బెల్జియం, కెనడా, బ్రిటన్, ఐర్లాండ్, మలేసియా, దక్షిణ కొరియా, స్పెయిన్, ఉక్రెయిన్) మధ్య క్వాలిఫయింగ్-2 టోర్నీ జరుగుతుంది. ఈ టోర్నీ ద్వారా మరో మూడు జట్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత పొందుతాయి.

డబుల్ ధమాకా...





- స్విస్ గ్రాండ్ చెస్ టోర్నీలో విజేతలుగా నిలిచిన వైశాలి, విదిత్
- ఇద్దరూ క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత

ఐల్ ఆఫ్ మ్యాన్ (యూకే): అంతర్జాతీయ వేదికపై భారత చెస్ క్రీడాకారులు ఆర్. వైశాలి, విదిత్ సంతోష్ గుజరాతి సత్తా చాటుకున్నారు. అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) ఆధ్వర్యంలో ఐల్ ఆఫ్ మ్యాన్ దీవిలో జరిగిన స్విస్ గ్రాండ్ టోర్నీలో ఓపెన్ విభాగంలో విదిత్ (మహారాష్ట్ర), మహిళల విభాగంలో వైశాలి (తమిళనాడు) చాంపియన్స్‌గా అవతరించారు. ఈ టోర్నీలో టైటిల్ సాధించిన తొలి భారతీయ క్రీడాకారులుగా వీరిద్దరు గుర్తింపు పొందారు. నిర్ణీత 11 రౌండ్ల తర్వాత విదిత్ 8.5 పాయింట్లతో... వైశాలి కూడా 8.5 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచారు. విదిత్ ఏడు గేముల్లో గెలిచి, మూడు గేమ్‌లను 'డ్రా' చేసుకొని, మరో గేమ్‌లో ఓడిపోయాడు. వైశాలి ఆరు గేముల్లో నెగ్గి, ఐదు గేమ్‌లను 'డ్రా' చేసుకొని అజేయంగా నిలిచింది. చాంపియన్స్‌గా నిలిచిన విదిత్‌కు ట్రోఫీలతో పాటు 80 వేల డాలర్లు (రూ. 66 లక్షల 57 వేలు), వైశాలికి ట్రోఫీలతో పాటు 25 వేల డాలర్లు (రూ. 20 లక్షల 80 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి. ఈ టైటిల్స్‌తో ఓపెన్ విభాగంలో విదిత్... మహిళల విభాగంలో వైశాలి క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధించారు. ఓపెన్, మహిళల విభాగాల్లో వేర్వేరుగా ఎనిమిది మంది ప్లేయర్ల మధ్య క్యాండిడేట్స్ టోర్నీ వచ్చే ఏడాది ఏప్రిల్‌లో 2 నుంచి 25 వరకు కెనడాలోని టొరంటోలో జరుగుతుంది. క్యాండిడేట్స్ టోర్నీలో విజేతగా నిలిచిన వారు ఓపెన్ విభాగంలో ప్రస్తుత ప్రపంచ చాంపియన్ డింగ్ లిరెన్ (చైనా)తో... మహిళల విభాగంలో ప్రస్తుత వరల్డ్ చాంపియన్ జు వెన్‌జున్ (చైనా)తో ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ కోసం తలపడతారు.

వెర్‌స్టాపెన్‌కు 17వ విజయం

బ్రెజిల్ గ్రాండ్‌ప్రి టైటిల్ సొంతం



సావ్‌పాలో (బ్రెజిల్): మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుకున్న రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ ఈ ఏడాది ఫార్ములావన్ సీజన్‌లో 17వ విజయాన్ని నమోదు చేశాడు. సీజన్‌లోని 20వ రేసు బ్రెజిల్ గ్రాండ్ ప్రిలో వెర్‌స్టాపెన్ అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. 71 ల్యాప్‌ల ప్రధాన రేసును 'పోల్ పొజిషన్'తో ప్రారంభించిన అతను చివరిదాకా తన ఆధిక్యాన్ని కాపాడుకొని విజేతగా నిలిచాడు. వెర్‌స్టాపెన్ అందరికంటే వేగంగా ఒక గంట 56 నిమిషాల 48.894 సెకన్లలో రేసును ముగించి టైటిల్ దక్కించుకున్నాడు. మొత్తం 20 మంది డ్రైవర్లలో 14 మంది మాత్రమే రేసును పూర్తి చేశారు. ఈ ఏడాది మొత్తం 22 రేసులు ఉండగా.. ఇప్పటికి 20 రేసులు ముగిశాయి. 17 రేసుల్లో వెర్‌స్టాపెన్ నెగ్గగా... రెండు రేసుల్లో సెర్జియో పెరెజ్ (రెడ్‌బుల్), ఒక రేసులో కార్లోస్ సెయింజ్ (ఫెరారీ) గెలిచారు. ఈ సీజన్‌లోని తదుపరి రేసు లాస్‌వేగస్ గ్రాండ్‌ప్రి ఈనెల 19న జరుగుతుంది.

ఫైనల్లో స్వియాటెక్



కాన్‌కున్ (మెక్సికో): మహిళల టెన్నిస్ సీజన్ ముగింపు టోర్నీ డబ్ల్యూటీఏ ఫైనల్స్‌లో ప్రపంచ రెండో ర్యాంకర్ ఇగా స్వియాటెక్ (పోలాండ్) ఫైనల్లోకి దూసుకెళ్లింది. సోమవారం జరిగిన రెండో సెమీఫైనల్లో స్వియాటెక్ 6-3, 6-2తో ప్రపంచ నంబర్‌వన్, గత ఏడాది రన్నరప్ సబలెంకా (బెలారస్)పై గెలిచింది. ఐదో ర్యాంకర్ జెస్సికా పెగూలా (అమెరికా)తో జరిగే ఫైనల్లో స్వియాటెక్ గెలిచి విజేతగా నిలిస్తే మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్‌ను సొంతం చేసుకుంటుంది.

గట్టెక్కిన బంగ్లాదేశ్

- వరుస ఆరు పరాజయాల తర్వాత మరో విజయం
- ప్రపంచకప్‌లో తొలిసారి శ్రీలంకపై గెలుపు
- కెప్టెన్ షకీబ్ ఆల్‌రౌండ్ ప్రదర్శన
- అసలంక సెంచరీ వృథా





న్యూఢిల్లీ: ప్రపంచకప్‌లో అద్భుతం సాధిద్దామనే లక్ష్యంతో భారత గడ్డపై అడుగుపెట్టిన బంగ్లాదేశ్ తొలి మ్యాచ్‌లో గెలిచి శుభారంభం చేసింది. ఆ తర్వాత ఒకటి కాదు.. రెండు కాదు.. మూడు కాదు.. వరుసగా ఆరు పరాజయాలను చవిచూసి సెమీ ఫైనల్ రేసు నుంచి నిష్క్రమించింది. ఈ ప్రపంచకప్‌లో టాప్-7లో నిలిస్తేనే 2025 చాంపియన్స్ ట్రోఫీకి అర్హత సాధించే అవకాశం ఉండటంతో బంగ్లాదేశ్‌కు ఎనిమిదో మ్యాచ్ కీలకంగా మారింది. మాజీ విశ్వవిజేత శ్రీలంకతో జరిగిన ఈ పోరులో బంగ్లాదేశ్ మూడు వికెట్ల తేడాతో నెగ్గి మళ్లీ గెలుపు బాట పట్టింది. గెలుపుదారిలో వికెట్లను చేజార్చుకోవడం కలవరపెట్టినా... చివరకు బంగ్లాదేశ్ నుంచి విజయం మాత్రం చేజారలేదు. ప్రపంచకప్ చరిత్రలో శ్రీలంకపై బంగ్లాదేశ్‌కిదే తొలి విజయం కావడం విశేషం. 280 పరుగుల లక్ష్య ఛేదనలో నజ్ముల్ హొస్సేన్ షాంతో (101 బంతుల్లో 90; 12 ఫోర్లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' షకీబుల్ హసన్ (65 బంతుల్లో 82; 12 ఫోర్లు, 2 సిక్సర్లు) కీలకపాత్ర పోషించారు. చివర్లో తౌహిద్ హ్రిదయ్ (7 బంతుల్లో 15 నాటౌట్; 2 సిక్సర్లు) నిలబడి బంగ్లాదేశ్ విజయాన్ని ఖాయం చేశారు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 49.3 ఓవర్లలో 279 పరుగుల వద్ద ఆలౌటైంది. చరిత్ అసలంక (105 బంతుల్లో 108; 6 ఫోర్లు, 5 సిక్సర్లు) సెంచరీ సాధించాడు. ప్రత్యర్థి బౌలర్లు తంజీమ్ హసన్ (3/80), షోరిఫుల్ (2/51), షకీబుల్ హసన్ (2/57) సమష్టిగా వికెట్లు పడగొట్టారు. అనంతరం బంగ్లాదేశ్ 41 పరుగులకే ఓపెనర్లు తంజిద్ హసన్ (9), లిటన్ దాస్ (23) వికెట్లను కోల్పోయింది. ఈ దశలో నజ్ముల్, షకీబ్ అర్ధసెంచరీలతో ఆదుకున్నారు. మూడో వికెట్‌కు 169 పరుగులు జోడించారు. 210 వద్ద షకీబ్, మరో పరుగు తర్వాత నజ్ముల్ నిష్క్రమించాడు. మహ్ముదుల్లా (22), ముష్ఫికర్ (10), మిరాజ్ (3) స్వల్ప వ్యవధిలో అవుటవడంతో బంగ్లాదేశ్‌కు ఇబ్బంది ఎదురైంది. అయితే తౌహిద్, తంజీమ్ జట్టును విజయతీరానికి చేర్చారు.

స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (బి) తంజీమ్ 41; పెరీరా (సి) ముష్ఫికర్ (బి) షోరిఫుల్ 4; మెండిస్ (సి) షోరిఫుల్ (బి) షకీబ్ 19; సమరవిక్రమ (సి) మహ్ముదుల్లా (బి) షకీబ్ 41; అసలంక (సి) లిటన్ (బి) తంజీమ్ 108; మాథ్యూస్ (టైమ్డ్ అవుట్) 0; ధనంజయ (స్టంప్డ్) ముష్ఫికర్ (బి) మిరాజ్ 34; తీక్షణ (సి) సబ్-అహ్మద్ (బి) షోరిఫుల్ 21; చమీర (రనౌట్) 4; రజిత (సి) లిటన్ (బి) తంజీమ్ 0; మదుషంక (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (49.3 ఓవర్లలో ఆలౌట్) 279. వికెట్ల పతనం:** 1-5, 2-66, 3-72, 4-135, 5-135, 6-213, 7-258, 8-278, 9-278, 10-279. **బౌలింగ్:** షోరిఫుల్ 9.3-0-51-2, టస్కిన్ 10-1-39-0, తంజీమ్ హసన్ 10-0-80-3, షకీబ్ 10-0-57-2, మిరాజ్ 10-0-49-1. **బంగ్లాదేశ్ ఇన్నింగ్స్:** తంజిద్ (సి) నిసాంక (బి) మదుషంక 9; లిటన్ దాస్ (ఎల్బీడబ్ల్యూ) (బి) మదుషంక 23; నజ్ముల్ (బి) మాథ్యూస్ 90; షకీబ్ (సి) అసలంక (బి) మాథ్యూస్ 82; మహ్ముదుల్లా (బి) తీక్షణ 22; ముష్ఫికర్ (బి) మదుషంక 10; తౌహిద్ (నాటౌట్) 15; మిరాజ్ (సి) అసలంక (బి) తీక్షణ 3; తంజీమ్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 23; **మొత్తం (41.1 ఓవర్లలో 7 వికెట్లకు) 282. వికెట్ల పతనం:** 1-17, 2-41, 3-210, 4-211, 5-249, 6-255, 7-269. **బౌలింగ్:** మదుషంక 10-1-69-3, తీక్షణ 9-0-44-2, కసున్ రజిత 4-0-47-0, చమీర 8-0-54-0, మాథ్యూస్ 7.1-1-35-2, ధనంజయ డిసిల్వా 3-0-20-0.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	8	8	0	16	2.456
దక్షిణాఫ్రికా	8	6	2	12	1.376
ఆస్ట్రేలియా	7	5	2	10	0.924
న్యూజిలాండ్	8	4	4	8	0.398
పాకిస్తాన్	8	4	4	8	0.036
అఫ్గానిస్తాన్	7	4	3	8	-0.330
బంగ్లాదేశ్	8	2	6	4	-1.142
శ్రీలంక	8	2	6	4	-1.160
నెదర్లాండ్స్	7	2	5	4	-1.398
ఇంగ్లండ్	7	1	6	2	-1.504

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే.-నెట్ రన్‌రేట్

ప్రపంచకప్‌లో నేడు

ఆస్ట్రేలియా X అఫ్గానిస్తాన్
వేదిక: ముంబై
మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

మాథ్యూస్ 'టైమ్డ్ అవుట్'

తొలి క్రికెటర్‌గా గుర్తింపు



శ్రీలంక క్రికెటర్ ఏంజెలో మాథ్యూస్ అనూహ్య, అరుదైన రీతిలో అవుటై క్రికెట్ చరిత్రలో తన పేరును లిఖించుకున్నాడు. 146 ఏళ్ల అంతర్జాతీయ క్రికెట్‌లో 'టైమ్డ్ అవుట్' ద్వారా అవుట్ అయిన తొలి క్రికెటర్‌గా అతను నిలిచాడు. సోమవారం బంగ్లాదేశ్‌తో న్యూఢిల్లీలో జరిగిన మ్యాచ్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. లంక ఇన్నింగ్స్ 25వ ఓవర్ రెండో బంతికి సమరవిక్రమ అవుటయ్యాడు. నిబంధనల ప్రకారం తర్వాతి బ్యాటర్ 2 నిమిషాల్లోగా బంతిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి. క్రీజ్‌లోకి మాథ్యూస్ సరైన సమయానికే వచ్చినా బంతిని ఎదుర్కోవడంలో ఆలస్యం చేశాడు. తన హెల్మెట్‌ను సరి చేసుకుంటుండగా దాని స్ట్రాప్ తెగింది. దాంతో మరో హెల్మెట్ కోసం సైగ చేయగా, చమిక మైదానంలోకి పరుగెత్తుకుంటూ వచ్చాడు. అప్పటికే సమయం మించిపోవడంతో బౌలర్, బంగ్లాదేశ్ కెప్టెన్ షకీబ్ 'టైమ్డ్ అవుట్' కోసం అప్పీల్ చేశాడు. దాంతో అప్పీల్‌ను పరిగణనలోకి తీసుకున్న అంపైర్లు చర్చించి నిబంధనల ప్రకారం మాథ్యూస్‌ను 'అవుట్'గా ప్రకటించారు. తన హెల్మెట్ సమస్యను బ్యాటర్ అంపైర్లకు వివరించినా వారు స్పందించలేదు. ఆ తర్వాత అప్పీల్ వెనక్కి తీసుకోమని షకీబ్‌ను కూడా కోరినా అతను ససేమిరా అనడంతో మాథ్యూస్ వెనుదిరగక తప్పలేదు. అనంతరం ఫోర్త్ అంపైర్ ఏడ్రియన్ హోల్డ్‌స్టాక్ దీనిపై మరింత స్పష్టతనిచ్చారు. 'మాథ్యూస్‌కు హెల్మెట్ సమస్య కూడా రెండు నిమిషాల తర్వాత వచ్చింది. అప్పటికీ అతను బంతిని ఎదుర్కోకుండా ఆలస్యం చేశాడు. క్రీజ్‌లోకి వచ్చే ముందు ఎక్విప్‌మెంట్‌లో అన్నింటినీ సరిగ్గా చూసుకోవడం కూడా బ్యాటర్‌దే బాధ్యత' అని ఆయన చెప్పారు. దాంతో షకీబ్ క్రీడా స్ఫూర్తి అంశాన్ని పక్కన పెడితే నిబంధనల ప్రకారం మాథ్యూస్‌ను అవుట్‌గా ప్రకటించడం సరైందే.

పంజాబ్ ఎట్టకేలకు...

మొహాలి: దేశవాళీ టి20 క్రికెట్ టోర్నమెంట్ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో పంజాబ్ జట్టు తొలిసారి చాంపియన్‌గా అవతరించింది. బరోడా జట్టుతో జరిగిన ఫైనల్లో పంజాబ్ 20 పరుగుల తేడాతో గెలిచింది. గతంలో పంజాబ్ నాలుగుసార్లు (2007, 2012, 2013, 2015) పంజాబ్ జట్టు రన్నరప్‌తో సరిపెట్టుకుంది. మొదట బ్యాటింగ్ కు దిగిన పంజాబ్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 223 పరుగులు సాధించింది. అన్‌మోల్‌ప్రీత్ సింగ్ (61 బంతుల్లో 113; 10 ఫోర్లు, 6 సిక్స్‌లు) మెరుపు సెంచరీ చేశాడు. అనంతరం బరోడా 20 ఓవర్లలో 7 వికెట్లకు 203 పరుగులు చేసి ఓడిపోయింది. బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ (4/23) పంజాబ్ విజయంలో కీలక పాత్ర పోషించాడు.

సినిమా

కనిపించడు.. వ్యాపించి ఉంటాడు!



● రవితేజ

''కొండలో లావాని కిందకి పిలవకు... ఊరు ఉండదు.. నీ ఉనికి ఉండదు'' అంటూ రవితేజ వాయిస్ ఓవర్‌తో మొదలవుతుంది 'ఈగల్' సినిమా టీజర్. రవితేజ హీరోగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ చిత్రం ఇది. కావ్యా థాపర్, అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రం టీజర్‌ను సోమవారం విడుదల చేశారు మేకర్స్. ''ఎక్కడుంటాడు?(అనుపమా పరమేశ్వరన్).. అడవిలో ఉంటాడు.. నీడై తిరుగుతుంటాడు.. కనిపించడు. కానీ వ్యాపించి ఉంటాడు ('అవసరాల' శ్రీనివాస్) వంటి డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ చిత్రం సంక్రాంతి సందర్భంగా జనవరి 13న విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: దావ్ జాంద్, సహ-నిర్మాత: వివేక్ కూచిభొట్ల.

అనుష్క @ 50



● అనుష్క

'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' వంటి హిట్ మూవీ తర్వాత అనుష్క నటించనున్న తెలుగు చిత్రం ఏంటి? అనే ప్రశ్నకు సోమవారం సమాధానం దొరికింది. నేడు (నవంబర్ 7) అనుష్క పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆమె నటించనున్న తాజా సినిమా ప్రకటన వచ్చింది. అనుష్క లీడ్ రోల్‌లో జి.అశోక్ దర్శకత్వంలో 'భాగమతి'ని నిర్మించిన యూవీ క్రియేషన్స్ అధినేతలు వంశీ, ప్రమోద్ తాజాగా 'భాగమతి 2'ని ప్రకటించారు. అనుష్క నటించనున్న 50వ చిత్రం ఇది. ఇక 'భాగమతి' చిత్రం 2018 జనవరి 26న విడుదలై, మంచి విజయం సాధించిన విషయం తెలిసిందే. దాదాపు ఆరేళ్లకి 'భాగమతి 2' సినిమా ప్రకటించారు వంశీ, ప్రమోద్. ఈ సినిమాని భారీ స్థాయిలో నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ చిత్ర దర్శకుడు, నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే ప్రకటించనున్నారు. కాగా అనుష్క నటించిన తాజా మలయాళ చిత్రం 'కథనార్' విడుదలకు సిద్ధమవుతోంది.

రంగరాయ శక్తివేల్ నాయకర్.. థగ్‌లైఫ్



● కమల్ హాసన్

'నాయగన్ '(1987) చిత్రం తర్వాత హీరో కమల్‌హాసన్, దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రానికి 'థగ్ లైఫ్' టైటిల్‌ని ఖరారు చేసి, టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోను సోమవారం రిలీజ్ చేశారు మేకర్స్. అలాగే ఈ చిత్రంలో త్రిష, దుల్కర్ సల్మాన్, 'జయం' రవి కీలక పాత్రలు పోషించనున్నట్లు కూడా వెల్లడించారు. 'రంగరాయ శక్తివేల్ నాయకర్.. నాది కాయల్ పట్టినమ్', 'రంగరాయ శక్తివేల్ నాయకర్ అంటే క్రిమినల్, గూండా, యాకుజా. యాకుజా అంటే జపనీస్‌లో గ్యాంగ్‌స్టర్ అని అర్థం', 'చావు నా కోసం ఎదురుచూడటం ఇదేం తొలిసారి కాదు. చివరిసారి కూడా కాదు', 'నా పేరు రంగరాయ శక్తివేల్ నాయకర్.. మర్చిపోవద్దు' అని కమల్‌హాసన్ చెప్పే డైలాగ్స్ 'థగ్స్ లైఫ్' టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోలో ఉన్నాయి. కమల్‌హాసన్, మణిరత్నం, ఆర్ మహేంద్రన్, శివ అనంత్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. నేడు కమల్ బర్త్ డే సందర్భంగా 'థగ్ లైఫ్'కి సంబంధించిన విశేషాలను సోమవారం వెల్లడించారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్, కెమెరా: రవి కె.చంద్రన్.

నన్ను కొత్తగా చూస్తారు

- రాఘవా లారెన్స్

రాఘవా లారెన్స్, ఎస్‌జే సూర్య ప్రధాన పాత్రల్లో నటించిన పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'జిగర్ తండ డబుల్ ఎక్స్'. కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో కార్తికేయన్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న తెలుగు, తమిళం, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా రాఘవా లారెన్స్, ఎస్‌జే సూర్య హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో చెప్పిన విశేషాలు.



● ఎస్‌జే సూర్య, రాఘవా లారెన్స్

లారెన్స్ మాట్లాడుతూ – ''జిగర్ తండ' సినిమాలోని గ్యాంగ్‌స్టర్ పాత్రలో నటించే తొలి అవకాశం నాకే వచ్చింది. కానీ అప్పుడు ఇతర ప్రాజెక్ట్స్‌తో బిజీగా ఉండటం వల్ల చేయడం కుదర్లేదు. ఆ తర్వాత 'జిగర్ తండ'కు రెండు జాతీయ అవార్డులు వచ్చాయి. దీంతో 'జిగర్ తండ' కు సీక్వెల్ ఉన్నట్లయితే అందులో నేను నటిస్తానని కార్తీక్ సుబ్బరాజుకి చెప్పాను. ఈ సీక్వెల్ 'జిగర్ తండ: డబుల్ ఎక్స్' కథ సిద్ధమైన ఏడాది తర్వాత కార్తీక్ సుబ్బరాజు ఫోన్ చేసి చెప్పారు. కథ నచ్చడంతో ఈ సినిమాలో నటించాను. ● ఈ సినిమా విషయంలో దర్శకుడు కార్తీక్ చెప్పినట్లు చేశాను. ప్రేక్షకులు కొత్త రాఘవా లారెన్స్‌ని చూస్తారు. సినిమా ఫస్టాఫ్‌లో యాక్షన్, సెకండాఫ్‌లో భావోద్వేగాల సన్నివేశాలు ఉంటాయి. ముఖ్యంగా చివరి 20 నిమిషాలు ప్రేక్షకుల హృదయాలను హత్తుకునేలా ఉంటుంది. సినిమా చూసిన తర్వాత ప్రేక్షకుల హృదయం కూడా బరువెక్కుతుంది. ● త్వరలో 'కాంచన 4' స్టార్ట్ చేస్తాను. ఇక సూపర్ స్టార్ రజనీకాంత్‌గారి కోసమే కాదు.. సూపర్ స్టార్, మెగాస్టార్ (చిరంజీవిని ఉద్దేశిస్తూ..) కలిసి యాక్ట్ చేసే ఓ మల్టీస్టారర్ స్క్రిప్ట్ నా దగ్గర ఉంది. కానీ వారు యాక్ట్ చేయాలి కదా'' అన్నారు.

నటుడు- దర్శకుడు ఎస్‌జే సూర్య మాట్లాడుతూ– ''దర్శకత్వం-నటన..ఈ రెండింటిలో నాకు నటన అంటేనే ఇష్టం. అయితే నా కెరీర్ ప్రారంభంలో యాక్టింగ్ అవకాశాల కోసం డైరెక్షన్‌ని వారధిగా వినియోగించుకున్నాను. ఇక 'జిగర్ తండ: డబుల్‌ఎక్స్'లో లారెన్స్‌గారిది గ్యాంగ్‌స్టర్ రోల్. నాదేమో దర్శకుడు కావాలనుకునే పాత్ర. నా పాత్రలో సత్యజిత్ రేగారి సినిమాల రిఫరెన్స్ ఉండటంతో ఇదొక బహుమతిగా భావించి ఈ మూవీ చేశాను. మంచి మాస్ కమర్షియల్ అంశాలు ఉన్న సందేశాత్మక చిత్రం ఇది. ఈ సినిమా షూటింగ్ కోసం ఓ విలేజ్ సెట్ వేయాల్సి వచ్చింది. ఇందులో భాగంగా ఓ రోడ్, బ్రిడ్జ్ వేశాం. అప్పటికే రోడ్, బ్రిడ్జ్ సౌకర్యాలు లేక ఇబ్బందిపడుతున్న ఆ గ్రామస్తులకు ఇవి ఇప్పుడు ఉపయోగపడుతున్నాయి. నేను నటిస్తూ, నా దర్శకత్వంలో ఓ సినిమా రానుంది'' అని చెప్పుకొచ్చారు.



● బన్నీ వాసు, తేజా మార్ని, అల్లు అరవింద్, అనిల్ రావిపూడి, శివానీ, రాహుల్ విజయ్, విద్య

ఈ కథ చాలా సంతృప్తినిచ్చింది

- నిర్మాత అల్లు అరవింద్

రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్ లీడ్ రోల్స్‌లో శ్రీకాంత్, వరలక్ష్మీ శరత్‌కుమార్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. తేజా మార్ని దర్శకత్వంలో 'బన్నీ' వాసు, విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 24న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌కి దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాత అల్లు అరవింద్ అతిథులుగా హాజరయ్యారు. అల్లు అరవింద్ మాట్లాడుతూ– ''పోలీసులను రాజకీయ నాయకులు ఏ విధంగా వాడుకున్నారనే అంశంపై ఈ సినిమా ఉంటుంది. చాలా సంతృప్తినిచ్చిన కథ ఇది. పోలీసులు పడే బాధలు, ఇబ్బందులు ఈ సినిమాలో ఉంటాయి'' అన్నారు. ''ఈ సినిమా ఒరిజినల్ (మలయాళ చిత్రం 'నాయట్టు') చూశాను. 'కోట బొమ్మాళి'లో చాలా మార్పులు చేశారు. టీజర్ చాలా ఆసక్తిగా ఉంది. ఇప్పుడు నిర్మాతగా వస్తున్న విద్యాగారు సక్సెస్ కావాలని కోరుకుంటున్నాను'' అన్నారు అనిల్ రావిపూడి. ''తేజా మార్ని డైరెక్షన్, కాశీ నాగేంద్ర డైలాగ్స్ ప్రేక్షకులను ఆలోచింపజేస్తాయి. సిటీల్లో జరిగే ఎన్నికల గురించి నాకు పెద్దగా తెలియదు. ఊర్లలో ఉన్న, అక్కడి ఎలక్షన్స్‌లో పాల్గొంటున్న వారికి ఈ సినిమాలోని కొన్ని సన్నివేశాలు గట్టిగా తగుల్తాయి. కొంతమంది రాజకీయ నాయకులకు కూడా తగలొచ్చు. ఏ పార్టీకీ కొమ్ము కాసేలా ఈ సినిమా ఉండదు'' అన్నారు 'బన్నీ' వాసు. ''నేరస్తులను పట్టుకోవాల్సిన పోలీసులే ఓ కేసులో ఇరుక్కుని ఎలా అవస్థలు పడ్డారనేది ఈ సినిమా కాన్సెప్ట్'' అన్నారు తేజా మార్ని. ''ఈ సినిమా కోసం అందరూ చాలా కష్టపడ్డారు'' అన్నారు విద్యా. ఈ కార్యక్రమంలో చిత్ర కో ప్రొడ్యూసర్స్ భాను-రియాజ్, రైటర్ కాశీ నాగేంద్ర, ఆర్ట్ డైరెక్టర్ గాంధీ, నిర్మాతలు ధీరజ్, వంశీ నందిపాటి, ఎస్‌కేఎన్ పాల్గొన్నారు.



● గౌరీకృష్ణ

ఈ విజయం కొత్తగా ఉంది

- నిర్మాత గౌరీకృష్ణ

''నేను గతంలో పలు సినిమాలు నిర్మించినా అనుకున్నంత విజయం సాధించలేదు. 'మా ఊరి పొలిమేర 2' చిత్రంతో తొలి హిట్ అందుకున్నా.. ఈ విజయం చాలా కొత్తగా ఉంది. మా సినిమాని ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు'' అని నిర్మాత గౌరీకృష్ణ అన్నారు. 'సత్యం' రాజేశ్, కామాక్షీ భాస్కర్ల జంటగా డా. అనిల్ విశ్వనాథ్ దర్శకత్వం వహించిన చిత్రం 'మా ఊరి పొలిమేర 2'. గౌరీకృష్ణ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 3న విడుదలైంది. ఈ సందర్భంగా గౌరీకృష్ణ మాట్లాడుతూ– ''మా ఊరి పొలిమేర' తొలి భాగం విజయం సాధించిందని సీక్వెల్ తీయలేదు. అనిల్ విశ్వనాథ్‌పై నమ్మకంతోనే 'మా ఊరి పొలిమేర 2' తీశాం. గీతా ఆర్ట్స్ సంస్థకు చెందిన వంశీ నందిపాటిగారు విడుదల చేయడం వల్ల సినిమాకు ప్లస్ అయ్యింది. నిర్మాతగా నా తర్వాతి చిత్రానికి కథా చర్చలు జరుగుతున్నాయి'' అన్నారు.

అన్నదమ్ముల అనుబంధం



● సంపూర్ణేష్ బాబు, సంజోష్

సంపూర్ణేష్ బాబు, సంజోష్, ప్రాచీ బన్సాల్, ఆర్తీ గుప్తా కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'సోదరా'. మన్‌మోహన్ మేనంపల్లి దర్శకత్వం వహించారు. చంద్ర చంగళ్ల నిర్మించిన ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని నిర్మాత వివేక్ కూచిభొట్ల రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా దర్శక-నిర్మాతలు మాట్లాడుతూ– ''అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో వినోదాత్మకంగా 'సోదరా'ను రూపొందించాం. ఇటీవలే విడుదలైన మోషన్ పోస్టర్‌కి మంచి స్పందన వచ్చింది. ఈ సినిమాని త్వరలోనే విడుదల చేయనున్నాం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సునీల్ కశ్యప్, కెమెరా: జాన్.

ఇది మనందరి కథ

- దర్శకుడు మారేష్ శివన్



''ప్రేమ, లక్ష్యం.. ఈ రెండింటినీ ఒకేసారి ఎంచుకోవాల్సి వస్తే ఏం చేస్తారు? ఏం చేయాలి? అనే సందేశంతో 'అలా నిన్ను చేరి' సినిమా తీశా. ప్రతి మనిషిలో జరిగే కథ ఇది. యువతరంతో పాటు కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రం ఇది. మా చిత్రాన్ని చూసిన తర్వాత కొంత మందైనా మారతారనే నమ్మకం ఉంది'' అని దర్శకుడు మారేష్ శివన్ అన్నారు. దినేష్ తేజ్, హెబ్బా పటేల్, పాయల్ రాధాకృష్ణ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'అలా నిన్ను చేరి'. కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 10న విడుదలవుతోంది. మారేష్ శివన్ విలేకరులతో మాట్లాడుతూ–''ఈ చిత్ర కథ 2012 నేపథ్యంలో జరుగుతుంది. 2012లో రాసుకున్న కథే అయినా ఇందులోని ప్రేమ, భావోద్వేగాలు ఇప్పటి వారికి కూడా నచ్చుతాయి. సుభాష్ ఆనంద్ సంగీతం ఓ ప్లస్. ఈ సినిమా ప్రీమియర్ చూసిన డైరెక్టర్ త్రినాథరావు, నిర్మాతలు బెక్కెం వేణుగోపాల్, బెల్లంకొండ సురేష్‌వంటి వారు మంచి సినిమా తీశానని అభినందించారు. ప్రేక్షకులు థియేటర్స్ నుంచి అదే భావోద్వేగంతో బయటికొస్తారు'' అన్నారు.